# సభకు మహిళలు భారీగా తరలిరావాలి

- పదేళ్ల కాలంలో బీఆర్ఎస్ అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత
- పారా తైక్వాండో జాతీయ క్రీడాకారుడు గౌతమ్‌యాదవ్‌కు అభినందన

పోచమ్మమైదాన్, ఏప్రిల్ 26: ఎల్కతుర్తిలో ఆదివారం జరుగనున్న బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ పండుగకు మహి ళలు భారీగా తరలిరావాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. వరంగల్ కొత్తవాడ గాయత్రి కాలనీలోని బీఆర్ఎస్ నాయకురాలు డాక్టర్ హరిరమాదేవి ఇంటికి కవిత శనివారం రాత్రి రాగా, హరిరమాదేవితో పాటు పలువురు మహిళలు శాలువాలతో సన్మానించి, పూల మొక్కలు అందజేశారు. అనంతరం కవిత మాట్లాడుతూ రజతోత్సవ సభకు ప్రతి ఇంటి నుంచి మహిళ వచ్చేలా చూడాలన్నారు. బీఆర్ఎస్ పదేళ్ల కాలంలో మహిళలకు అందజేసిన పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ ఏడాదిన్నర పాలనలోనే ప్రజలు విసుగు చెందుతున్నారని, రానున్న కాలంలో బీఆర్ఎస్ పార్టీకే అధికారం అప్పజెప్పే రోజులు వస్తాయని, అందరూ కలిసికట్టుగా సభకు విచ్చేసి విజయవంతం చేయాలని కోరారు.



పారా తైక్వాండో క్రీడాకారుడు గౌతమ్‌యాదవ్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ కవిత

### గౌతమ్‌యాదవ్‌ను అభినందించిన కవిత

కాశీబుగ్గ, ఏప్రిల్26 : పారా తైక్వాండో జాతీయ క్రీడాకారుడు గౌతమ్‌యాదవ్‌ను ఎమ్మెల్సీ కవిత అభినందించింది. వరంగల్ నగరంలోని 3వ డివిజన్ పైడిపల్లికి చెందిన రైతు బంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఎల్లావుల లలితాకుమార్ యాదవ్ కుమారుడు గౌతమ్‌యాదవ్ నివాసానికి ఎమ్మెల్సీ కవిత వచ్చింది. ఇటీవల బెహ్రెయిన్ దేశంలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ పారా తైక్వాండో పోటీలో గౌతమ్‌యాదవ్ గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ తెలంగాణలోనే మొదటి సారిగా వరల్డ్ పారా తైక్వాండోలో గోల్డ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. ఇక ముందు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. యువత గౌతమ్ యాదవ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ కవితను ఎల్లావుల లలితాయాదవ్, కుమార్‌యాదవ్ సన్మానించారు.



కార్యకర్తలకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

తరిగొప్పుల, ఏప్రిల్ 26: ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాజభోగం అనుభవిస్తున్నారని ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. నేడు కేసీఆర్ సభకు స్వచ్ఛందంగా తరలిరవాలని బీఆర్ఎస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో దొంగ హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. వివిధ అభివృద్ధి పనులు చేపట్టినా ఇప్పటికీ పూర్తికాలేదని ఆరోపించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి చిలివేరు లింగం, నాయకులు ముద్దసాని వెంకట్‌రెడ్డి, జొన్నగోని సుదర్శన్‌గౌడ్, చెన్నూరి సంజీవ, దామెర ప్రభుదాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు అంకం రాజారాం, భూక్యా జూంలాల్‌నాయక్, తుపాకుల సత్తయ్య, బూస యాదగిరి, కొండ కుమార్ పాల్గొన్నారు.



హసన్‌పర్తి : పెడగపల్లి క్రాస్ రోడ్డు నుంచి ఎర్రగట్టుగుట్ట వద్దకు నిర్వహించిన ఎడ్లబండ్ల ర్యాలీలో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

# గుండె నిండా కృతజ్ఞతతో రజతోత్సవ సభకు కాలినడకన..

- కేసీఆర్ పథకాలు తమ కుటుంబాన్ని నిలబెట్టాయని 75 ఏళ్ల రైతు 75 కిలోమీటర్ల ప్రయాణం
- గంగ్యానాయక్‌కు స్వాగతం పలికిన బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ/సంగెం, ఏప్రిల్ 26 : ఆ రైతు వయస్సు 75 ఏళ్లు. కన్న కొడుకును కోల్పోయిన విషాద సమయంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతు బీమా రూపంలో వచ్చిన రూ.5 లక్షలు ఆ కుటుంబాన్ని ఆదుకుంది. ఈ క్రమంలో గుండె నిండా కృతజ్ఞత నింపుకొని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామం చంద్రుతండాకు చెందిన రైతు భూక్యా గంగ్యానాయక్ మండుతున్న ఎండను సైతం లెక్క చేయ కుండా కాలినడకన(సుమారు 75 కిలోమీటర్లు) ఎల్కతుర్తిలో నిర్వ హిస్తున్న బీఆర్ఎస్ రజతోత్సవ సభకు బయలుదేరాడు. శనివారం వరంగల్ జిల్లా నెక్కొండ పట్టణానికి(15 కిలోమీటర్లు) చేరుకున్నాడు. చేతిలో కేసీఆర్ జెండా పట్టుకొని ముందుకు సాగుతున్నాడు. కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతు బీమాలాంటి పథకాలు రైతు కుటుంబా నికి ఆశాకిరణాలుగా మారాయి. కన్న కొడుకును కోల్పోయిన విషాద సమయంలో రైతు బీమా రూపంలో వచ్చిన రూ.5లక్షలు పరిహారం ఆ కుటుంబాన్ని నిలబెట్టింది. దీంతో కేసీఆర్ తమ జీవితాల్లో దేవుడిగా నిలిచారని చెబుతున్నారు రైతు గంగ్యానాయక్. కాలినడకన నెక్కొండ కు చేరుకున్న గంగ్యానాయక్‌కు బీఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కాగా, సంగెం మండలం గవిచర్ల గ్రామంలో మాజీ సర్పంచ్ దొనికెల రమాశ్రీనివాస్ స్వాగతం పలికి, మజ్జిగ ప్యాకెట్లను అందజేసి తొవ్వ ఖర్చులకు రూ. 500 అందజేశారు.



నెక్కొండలో రైతు గంగ్యానాయక్‌ను సన్మానిస్తున్న స్థానిక బీఆర్ఎస్ నాయకులు








